# 25. గంగ

ఉద్యోగం నుండి విరమించిన తరువాత నేను, శ్రీమతి మా అబ్బాయి దగ్గరికి వెళ్లాము. వాడికి ఆ మధ్యనే ఉద్యోగం దొరికింది, పిమ్మట పెళ్లయింది.

ఆవూరు బెంగాలు, బీహారు రాష్ట్రాల సరిహద్దులో ఉంది. అక్కడ నూరు సంవత్సరాల క్రింద బ్రిటిష్ వారు స్థాపించిన పెద్ద కంపెనీ ఇప్పటికీ పనిచేస్తున్నది. పైపదవులలో ఉండే వాళ్లకు కంపెనీ వాళ్లు కట్టించిన బంగళాలు దొరుకుతాయి. ఒకవేళ అవి కాళీ లేకపోతే యిళ్లు అద్దెకు తీసుకొని వాటిని ఉద్యోగులకిచ్చేవారు.

మా అబ్బాయికి ఉద్యోగంలో చేరిన వెంటనే యిల్లు దొరకలేదు. కొంత కాలమయాక బస్తీలో ఒక ప్రయివేటు యిల్లు యిచ్చారు. ముందు విశాలమైన ఖాళీ స్థలం, చిన్న పిట్ట గోడ, వీధిలో పెద్ద వరండా, రెండు పడకగదులు, వంటిల్లు, భోజనాలగది, స్టోరు రూము పెరట్లో. అన్నివిధాల ఆయిల్లు సదుపాయంగా ఉంది. వీధి ఆవరణలో నూరు వరహాలు చెట్టు, మందారపు మొక్క, తులసి మొక్కలు ఉన్నాయి. ఏ రోజు పూజకు ఆరోజుపూవే శ్రీమతికి అభించేవి.

కాని యింత మంచి ఇంటికి కొన్ని యిబ్బందులు తప్పలేదు. ఆయిల్లు బస్తీలో ఉందేమో పరిసరాలు ఏమంత బాగుండేవికావు. చుట్టూ పాలమ్ముకునే వాళ్లే ఉన్నారు. ఇళ్లముందే రాటలు పాతి ఆవుల్ని, గేదెల్ని కట్టేవారు. వాళ్లు వారణాసి ప్రాంతం నుండి వచ్చి చిన్న చిన్న మట్టి గోడలు , వాటి మీద దూరదూరంగానేసిన పెంకులున్న యిళ్లు కట్టుకొని, ఎన్నేళ్లనుంచో పాలవ్యాపారం చేసుకుంటున్నారు.

ఇంటికి కొంచెం దూరంలో పక్కా రోడ్డుంది. దానికి కలుపుతు ఉన్న సందులోంచి మనుషులు పశువులు రావడం పోవడం జరుగుతుంది. అక్కడ వీధి లాంతరు కూడా లేదేమో, అప్పుడప్పుడు రాత్రి వేళ వస్తే చీకటిలో ఇంటి ముందు పడుక్కున్న ఐరావతాల్లాంటి కారు నలుపు గేదెల మీద పడడం జరిగేది.

మేమాయింట్లో దిగేటప్పటికి వర్షాకాలం రాలేదు. దిగిన రెండు వారాల్లోనే ఋతువు మారింది. మొదటి రోజుల్లో గాలి, మెరుపులు పిడుగులు హెచ్చుగా ఉండేవి. క్రమంగా వర్షాలు ఎడతెరిపిలేకుండా కురవడం మొదలెట్టాయి. దానా, దీనా, మాయింటి ముందున్న సందు, పశువుల గిట్టల తొక్కిడికి బాడిగా తయారయి, కాలు మోపడానికి గట్టినేల దొరక్కుండా పోయింది.

వర్షాలు అంతులేకుండా కురిసేవి. పశువుల్ని కట్టినచోట్ల నీళ్ళు నిలిచి, దోమలు హెచ్చుయాయి. దోమలకు తెరలు కట్టుకునే వాళ్లం. అంతకన్న పెద్దకష్టమే వచ్చిపడింది. రాత్రి ఏ పదకుండు గంటలకో మంచి నిద్రలో ఉన్నప్పుడు కరెంటు పోయేది. మీదనున్న పంకా ఆగిపోడంతో ఉడకపోత మొదలయేది. కిటికీ తలుపులు గాలి కోసం తెరిచితే గుంపులుగా దోమలు లోపలికొచ్చి తెరలోకి దూరిపోయేవి. ఈ బాధ ఉదయం ఆరు గంటల వరకు కొన సాగేది. రాత్రంతా నిద్రలేక, పగులు నిద్ర రాక భరించలేని యాతనకుగురయి ఎప్పుడు యిల్లు విడిచిపోదామా అనిపించేది.

పరిస్థితులు ఇలా ఉంటుంటే, చంటి పిల్లను తీసుకొని మాకోడలు పుట్టింటి నుంచి వచ్చింది. మనుమరాలిని చూడడానికి ఎవరో ఆడంగులు వస్తూ, వెళ్తూ ఉండేవారు.

ఒక రోజు వర్షం తెరిపిచ్చింది. వీధివరండాలో వాలు కుర్చీ వేసికొని వారపత్రికలలోని సీరియల్సు వేరు చేస్తూ, పనికిరాని కాగితాలు పక్కనిపెడుతూ కూర్చున్నాను. రాత్రంతా నిద్రలేదు. చికాకు చికాకుగా ఉంది. బస్తీలోని పాలవ్యాపారస్తుల ఆడవాళ్లు ఒకరూ ఒకరూ ఆవరణగేటు తీసుకొని లోపలికి వస్తున్నారు. తలెత్తి చూశాను. ఆ వరణగోడకు అటువైపు వరుస తీర్చి ఎనిమిది. పదేళ్లలోపు పిల్లలు నిలబడి నావేపు చూస్తున్నారు.

రాత్రి నిద్రలేక చికాకుగా ఉందేమో, వాళ్లందరిని చూసి కసురుకున్నాను. మధ్యమధ్య పల్లెటూరి హిందుస్తానీ ఆడంగులు లోపలికి రావడం, ఆవరణగేటు తలుపు తెరచి ఉంచడం, చెప్తేనే గాని మూయకపోడం, అన్నీ చికాకునే కలిగిస్తున్నాయి.

అపుడు ఒక్కసారిగా ఒకపడుచు పిల్ల లోనికి దూసుకొని వచ్చింది. వచ్చిన మనిషి యింట్లోకి పోకుండా నా ఎదుటే నిలబడింది

"బాబుజీ !" ఆ పిల్ల నాతోనే మాట్లాడింది తలెత్తి ఆమెవైపు చూసి అడిగాను.

"ఎవరునువ్వు ? "

"గంగను "

"ఏ గంగవి ? "

" మీకు పాలుపోసే గోపాల్ చెల్లెల్ని"

గోపాల్ గురించి నాకు అంతంత మాత్రమే తెలుసు.

గోపాల్ తండ్రి అరవై అయిదేళ్లవాడు. మనిషి పొడుగ్గా ఉంటూ కాయకష్టానికి అలవాటు పడ్డ వాడేమో, రెండు చేతులలోను రెండు బరువైన చేదలతో కుళాయి నుండి నీళ్లు తెస్తుంటాడు. ఆవులకు గేదెలకు మేతపెట్టడం, పాలుతీయడం మొదలైన పనులు చేస్తుంటాడు. గోపాల్ తల్లి పొట్టిగా బొద్దుగా ఉంటుంది. ఇంటి పనులు చేయడమే కాక సందుగోడల మీద పిడకలు పెడుతుంది.

గోపాల్‌కి ఇద్దరన్నదమ్ములు. పెద్దవాడు కిరణా దుకాణం మాయింటిపక్కనే పెట్టుకున్నాడు. వ్యాపారం బాగానే ఉంది. చిన్న తమ్ముడే పాలు యిళ్లకు పట్టుకెళ్లి కొలుస్తాడు. గోపాల్‌కి ముగ్గురు చెల్లెళ్లు. పెద్ద చెల్లిలికి చిన్నప్పుడే పెళ్లయింది. కాని, కొంచెం గూని ఉన్న ఆమె అత్తవారింటికి వెళ్ళలేదు. మేనమామకు పెళ్లాం పోతే, అతని పిల్లలను పెంచుతూ, అతనితో కాపురంచేస్తూ ఉండిపోయింది.

ఆఖరు చెల్లెలు పదేళ్ల పిల్ల. ఆమెకు పొట్టపెద్దది. డాక్టరుకు చూపిస్తే, అందులో ట్యూమరుందని, ఆపరేషనుకు అయిదువేలు కావాలన్నాడు. అంత డబ్బు లేక గోపాల్ ఆమె గురించి శ్రద్ధ తీసుకోలేదు.

మరీ రెండో చెల్లెలెవరు ?

ఆమెను అత్తవారింటికి పంపించారని విన్నాను. వెళ్లి ఆరు నెలలయిందని కూడా తెలుసు.

అయితే ఆమె ఎప్పుడొచ్చింది ?

గోపాల్ మా అబ్బాయి పనిచేసే కంపెనీలోనే చప్రాసీగా పని చేస్తున్నాడు. రోజూ పొద్దున్న ఉద్యోగానికి పోతూ, నాకో నమస్కారం చేస్తుంటాడు. అప్పుడప్పుడు సాయంకాలాల్లో కూడా కలుస్తుంటాడు. మరెందుకు గంగ వచ్చిందని చెప్పలేదు ?

"ఎప్పుడొచ్చావు ?" ఆమెనడిగాను.

"రెండు రోజులయింది !!"

"ఏం కావాలి నీకు ? "

" నాకేమీ అక్కర్లేదు. చూశారా గోడమీద కూచున్న కోతుల్ని ? వాళ్లంతా మీరు కోపపడతారేమోనని ఆవరణ గోడ దాటి లోపలికి రావడం లేదు".

"వాళ్లకేం కావాలి ?"

"మీరు చాలాకాగితాలు పోగు పెడుతున్నారు కదా! పాపం వాళ్లు పడవలు చేసుకుంటారు, మీరిస్తే "

తరువాత ఒకరూ ఒకరూ వచ్చి ఒకొక్క కాగితమే పట్టుకు వెళ్లారు. అందరూ పదేళ్లలోనివాళ్లే. మగపిల్లలు నిక్కర్లు తొడుకున్నారు. ఆడపిల్లలు చంటి తమ్ముళ్లనో, చెల్లెళ్లనో చంకలో వేసుకొచ్చారు.

అలా వాళ్లతో పరిచయమయింది.

క్రమంగా భయంతగ్గి, వాళ్లు నా ఎదుట కూర్చొని బడి పుస్తకాలు తెచ్చి చదువుకునేవారు. గళ్లాట లాడుకునే వాళ్లు. ఏడుస్తున్న చంటి పిల్లలను ఓదారుస్తూ, కిరాణా దుకాణం మీద కొనుక్కున్న బిళ్లలు, బటాణీలు తింటూ కూర్చునేవాళ్లు. వాళ్ల యిళ్లు చిన్నవేమో, విశాలమైన మా వీధి వరండాలో వాళ్లకి స్వేచ్ఛగా ఆడుకోడానికి చోటు దొరికింది.

పిల్లలు ఈ విధంగా రావడంతో ఇల్లు కలకలలాడడం మొదలు పెట్టింది.

ఒక రోజు శ్రీమతి మనుమరాలికి చిన్న బొంత కుట్టడానికి పాత చీరలు, పంచలు దగ్గరపెట్టుకొని కత్తిరిస్తూ కూర్చుంది. మామూలుగా గంగ లోపలి కొచ్చి శ్రీమతి దగ్గర కొంచెం సేపు నిలబడి, అడిగింది.

"అమ్మగారూ !" ఈ చిన్న చదర ఎవరికోసం కూరుస్తున్నారు ? "

"మా మనవరాలికి"

గంగ నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్ ? " శ్రీమతి అడిగింది, కత్తిరించడం ఆపి.

"మీ మనవరాలు ఎప్పుడూ ఎంత చిన్నదిగానే ఉంటుందా ?"

"అమ్మాయి పెరుగుతుందిలే ! అప్పుడు మరోటి కుట్టుకోవచ్చు."

"అమ్మగారూ ! చిన్నప్పుడు కుట్టిన బొంత అమ్మాయికి పెళ్లయే దాకా ఉండాలి !"

"ఏం విడ్డూరం ? పాత చీరల్తో కుట్టిన బొంత పాతికేళ్లదాకా ఉంటుందా?"

"మరేం ! నా బొంత తెచ్చి చూపిస్తా"

గంగ తన బొంత తెచ్చి చూపించింది.

ఆరడుగులు పొడవు, నాలుగున్నర అడుగులు వెడల్పు, కొంచెం మందంగా ఆబొంత ఉంది. పైన ఒక వైపు నీలం ముఖమలు బట్ట, రెండోవైపు ఆకు పచ్చ పట్టుబట్ట ఉన్నాయి. పదిహేడేళ్లయికుట్టినా ఆబొంత యింకా కొత్తగా ఉన్నట్లుంది. దాని మీద కుట్లు కూడా చాలా దగ్గరగా, డైమను ఆకారాలలో ఉన్నాయి. మధ్య మధ్య లతలు, ఏనుగులు, హంసలు, పద్మాలు.

అందరం చాలా ఆశ్చర్య పోయాం.

"ఎలా కుట్టడం ఇంత బొంత?" మా కోడలడిగింది.

"మేమందరం ఉన్నాం కదా! కుట్టడం మేమే చూసుకుంటాం. రంగుదారాలు, పట్టుకుచ్చులు, పైని కిందను వెయ్యడానికి మేలురకంవి తెప్పించండి."

ఆ రోజునుండీ బొంత కోసం అన్ని ప్రయత్నాలు జరిగాయి. మా అబ్బాయికి పనిహెచ్చుగా ఉండడం చేత బజారుకి పోడానికి వీలు చిక్కేది కాదు. ఆడవాళ్లు ముందు కొన్ని దారాలు తెచ్చి. వాటిని మార్చడానికి, కొత్తవాటిని కొనడానికి నన్ను బజారుకు పంపించే వారు.

బస్తీలోని ఆడవాళ్లలో అనుభవమున్న వాళ్లు, ఒకరో యిద్దరో రోజూ వచ్చి బొంత మీద పని చేసే వారు. పై బట్టల పోగులు తీసి వాటిలొంచి రంగులదారాలు దూర్చడం, డిజైనులో తేడా కనిపిస్తే, అవన్నీ విప్పడం చేస్తుండేవారు.

ఎవరు వచ్చినా రాకపోయినా గంగ మాత్రం క్రమం తప్పక వచ్చేది. నవ్వుతూ వచ్చేది. పనిచేస్తున్నంత సేపు ఉత్సాహం చూపించేది. నవ్వుతూ వెళ్లిపోయేది. ఇంట్లో చనువుగా తిరిగేది.

ఒక రోజు మధ్యాహ్నం నిద్రలేచి వీధి వరండాలో కూర్చున్నా. వేయించిన సింగాడాలు పళ్లెంనిండా తెచ్చింది. మిఠాయి కూడా పట్టుకొచ్చింది.

“ఇవన్నీ దేనికి గంగా ? ” శ్రీమతి అడిగింది.

“ఇవాళ నాపుట్టిన దినం అమ్మగారూ ! ”

“ఇవన్నీ ఎవరు చేశారు ? ”

“నేనే ”

అవి చాల రుచిగా ఉన్నాయి. ఏమయితేనేం గంగ మంచి పనివంతురాలు.

గంగ వంగి నాకు, శ్రీమతికి దండం పెట్టింది.

శ్రీమతి రవికల గుడ్డ ఒకటి పెట్లోంచి తీసి, గంగ చేతిలో పెట్టి దీవించింది.

“వచ్చే ఏటికి చంటిపిల్లడి తల్లివయి రావాలి!”

గంగ నవ్వింది. ఆనవ్వులో వెలుగులేదు. పేలవంగాదీనంగాఉందా నవ్వు.

ఆ రంగు రంగుల బొంతను గంగ పూర్తి చేసే సరికి రెండు నెలలు దాటాయి.

ఒక బుధవారం నాడు, బస్తీలోని ఆడవాళ్లంతా వచ్చి. పట్టె మంచం మీద ఆబొంత పరిచి, దానిమీద మామనుమరాలిని పడుక్కో బెట్టి ఏవేవో పాటలు పాడారు.

అది బొంతకాదు - రత్న కంబళమే - ఎంతో గొప్పకళాఖండం,పల్లెటూరి హిందుస్తానీ స్త్రీలు చాల ఓర్పుతో సాధించిన ఘనవిజయం.

బొంత పూర్తయే సరికి దానికింద రెండు వందలరూపాలయ ఖర్చ యితేనేం ! దాని విలువ ఇంకా ఎన్నో రెట్లుంటుంది. సామాను విలువ. నేను లెక్కవేశాను. వాళ్ల కళా కౌశలాన్ని లెక్కకట్టడం నాకు సాధ్యమైన పనికాదు. అభిమానంతో వాళ్లు తయారు చేశారేమో దాని విలువ ఎవరు నిర్ణయించగలరు?

దగ్గర బంధువుల యిళ్లల్లో పెళ్లిళ్లుంటే నేను, శ్రీమతి దేశం వచ్చాము.

ఆ రావడం రావడం ఆరునెలల పర్యంతం విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాలలో ఉండి పోయాము.

మావాడి నుండి అప్పుడప్పుడు ఉత్తరాలు వచ్చేవి. మనుమరాలు బాగా ఉసులాడుతోంది. ఒక ఉత్తరంలో కంపెనీ ఫ్లాటు దొరికినట్లు వ్రాశాడు. పై అంతస్తు అది. మంచిగాలి, వెలుతురు -పరిశుభ్రమైన పరిసరాలు. వెడల్పు తారురోడ్డు. క్లబ్బు కూడా దగ్గరలో ఉంది.

ఇరవై నాలుగు గంటలు కరెంటు, నీళ్లు ఉంటాయి. మంచి యిరుగు, పొరుగు. మనుమరాలికి అన్నముహూర్తం చేయవలసిన ఉందని, పుట్టిన దినం కూడా దగ్గరపడుతున్నదని, వీలయినంత వేగం రమ్మని మా అబ్బాయి ఉత్తరాలు వ్రాశాడు.

మేము కొత్త ఫ్లాటులో అడుగు పెట్టిన తరువాత గాని దాని సౌకర్యాలు తెలిసిరాలేదు. ఇరుగు పొరుగు వారు మా అబ్బాయితో పనిచేసే యింజనీర్లే, వారి భార్యలు యూనివర్సిటీలలో చదివి చాలా ధారాళంగా ఇంగ్లీషు, హిందీ మాట్లాడేవారు. వాళ్ల పిల్లలు దబ్బ పళ్లలా ఉంటారు. అందరూ సంస్కారమున్న వాళ్లు, సభ్యత తెలిసిన వాళ్లు.

అన్నిటికన్న ముఖ్యం ఇక్కడ దోమలు చాలాతక్కువ. క్లబ్బు దగ్గరగా ఉందేమో, పత్రికలకు పుస్తకాలకు లోటులేదు. వారానికి రెండు సినిమాలు.

అన్నీ దివ్యంగానే ఉన్నాయి.

శ్రీమతి పూజకు పువ్వులు కావాలి. కొత్తగా కట్టిన యిళ్లేమో, మొక్క, మోడి అంతగా లేవు. వచ్చిన నాలుగు రోజుల తరువాత పూల కోసం మేమున్న పాతయింటి వేపు బస్తీకి నడిచాను.

ఆయింట్లో ఎవరో దిగినట్లున్నారు. ఆవరణలోపలున్న నూరు వరహాలు చెట్ల కొమ్మలు కొట్టేశారు. మందారపు మొక్క నామమాత్రానికే ఉంది. తులసి మొక్కలు పేరుకైనా లేవు. విశాలమైన వీధి వరండాలో ఒక్కపిల్లకాయ కూడాలేడు. ఆవరణగేటుకి తాళం కూడా వేశారు.

ఓ క్షణం సందులో గేటు దగ్గర నిలబడి యింటి వేపు చూస్తుంటే గోపాల్ కూతురు నన్ను చూసి బాబూజీ ఆయా, బాబూజీ ఆయా! అంటూ పెద్ద కేక పెట్టింది. ఎక్కడి నుంచి వచ్చారో పిల్లలు, పులుపులో మంటూ నన్ను వాళ్లు చూట్టు ముట్టారు. పెద్ద పిల్లలు నన్ను కౌగిలించుకున్నారు. చంటిపిల్లలు ఓ క్షణం నన్ను చూసి, చేతులు చాచారు ఎత్తుకోమని.

పెద్ద పిల్లలు మాయింటి కొచ్చినప్పుడు చంటి పిల్లల్ని నాదగ్గర విడిచి పెట్టి ఆడుకునే వారు. అందుచేతనే వాళ్లకు నా దగ్గర మరీ చనువు ఏర్పడి నన్ను చూడగనే చేతులందించారు. ఆ చిన్న పిల్లల అభిమానానికి నాకళ్లు చెమర్చాయి. వాళ్లంతా కొంత దూరం నాతో వచ్చి ఎన్నో ప్రశ్నలు వేశారు. మనుమరాలిని చూడడానికి రావచ్చా అని అడిగారు. సాహెబుల యిళ్లల్లోకి వాళ్లలాంటి పిల్లలను రానిస్తారా అని ప్రశ్నించారు.

శ్రీమతి పూజకు పూవులు దొరక్కపోయినా నాహృదయం మాత్రం సౌగంధ్యంతో నిండిపోయింది.

మనస్సు ఆచిన్న వాళ్లప్రేమకు ఆనంద పరవశమయినా ఏదో ముఖ్యమైన విషయం మరిచిపోయినట్లయింది. జ్ఞాపకతెచ్చు కోవాలని ప్రయత్నం చేశాను. కాని, ఇల్లు చేరుకోగానే ఎవరో అతిథులు వస్తే అన్నీ మరచిపోయాను, సాయంకాలం వరకు.

రాత్రి భోజనాలయి పడుకోబోయే వరకు పొద్దున్న మర్చి పోయిన విషయం జ్ఞాపకానికి

రాలేదు. మంచం మీద పరచిన బొంత చూడగానే అన్నీ తలపుకు వాచ్చాయి.

ఒక్కసారి గంగ నా ఆలోచనలలో నిండి పోయింది. మొదటిలో ఆమె గురించి వివరాలు తెలియక పోయినా క్రమక్రమంగా ఒకటీ ఒకటీ బైటపడ్డాయి.

గంగకు పెళ్లయిన ఆరునెలల వరకు అత్తవారింటికి పంపలేదు. కట్నంగా ఇస్తామన్న ఐదు వేల రూపాయలలో ఇంకా మూడు వేలు బాకీ పడడం చేత, వాళ్లు గంగను గడపతొక్కనివ్వలేదు. అప్పుడు కూడా గోపాల్ పూర్తిగా బాకీ తీర్చ లేక పోయాడు, కట్నం బాకీ క్రింద మూడు వేల రూపాయలు సమర్పించుకుంటే, ఒక వెయ్యి మాత్రం కట్నం క్రింద జమకట్టి, సారెసామాను క్రింద రెండు వేల రూపాయలు తీసుకున్నారు. పిల్లను మాత్రం గడపతొక్క నిచ్చారు. దానికే గోపాల్ పొంగిపోయాడు.

ఉన్న ముగ్గురు చెల్లెళ్లలోను పెద్దది తలవంపులే తెచ్చింది. ఆఖరుది అయిదు వేలు పెట్టి ఆపరేషను చేయిస్తేనే బతుకుతుంది. ఇక మిగిలిన రెండో చెల్లెలు కాపురం స్థిరపడితే చాలని, అతను అప్పులు చేసి ఆమెను అత్తింటికి దిగ బెట్టాడు.

ఆరు నెలల్లోగా రెండువేల కట్నం తీసుకు రాకపోతే ఇంట్లోంచి తగిలేస్తామని నిక్కచ్చిగా చెప్పారు. ఆగడ్డువయిపోగానే పనిపాటులురావని కోడల్ని యింట్లోంచి గెంటేశారు. వయసులో నున్న ఆడకూతురు చేతిలో చిల్లిగవ్వయినా లేకుండా, పగటి బండిలో వారణాసిలో బయలుదేరి రాత్రికి యిల్లు చేరుకుంది.

గంగ యింటికి చేరిన వారంరోజుల్లోనే గోపాల్ అత్తవారికి ఉత్తరం వ్రాశాడు. పదిపదిహేను రోజుల్లో డబ్బు చూసుకొని పంపుతానన్నాడు. అప్రకారం చేస్తే గంగ పదిహేను రోజుల్లో తిరిగి వెళ్లి పోయేదే.

కాని, వెంటనే జవాబు వచ్చింది. అల్లుడికి ఏదీ ఉద్యోగం లేనందున వ్యాపారం పెడుతున్నాడని, అందుచేత యివ్వవలసిన రెండు వేలకు మరో మూడు వేలు జతచూసి పంపినప్పుడే పిల్లను గుమ్మం తొక్కనిస్తామని వ్రాశారు.

అందుచేత గంగ మూడు నెలల పాటు పుట్టింట్లో గడిపింది. అంటే ఆ సొమ్ము కూర్చు కోడానికి గోపాల్‌కి అంత కాలం పట్టిందన్న మాట. ఒక విధంగా మా యింట్లో బొంత తయారవడానికే ఆమె ఉండి పోయిందేమో ననిపించింది.

గంగ గురించే అడుగు దామని బయలుదేరిన వాడిని, పిల్లల్ని చూడడంతో అన్నీ మరచిపోయాను. ఆమె గురించి ఆలోచిస్తూ ఉంటే అర్ధరాత్రి దాటి పోయింది.

లోకంలో చాల మంది అందమైన అమ్మాయిలున్నారు. ఎంత మందో మాటకత్తెలున్నారు. కాని, ఎవరు కూడా గంగకు సాటికారు.

"బాబుజీ ! ఎందుకో ఈ మధ్య మీరు మరీ చికాకు పడిపోతున్నారు. ఈ యిబ్బందులు తప్పనివి. దోమల గోల, కరెంటుకోత, ఉడకపోత మనమెంత విసుక్కున్నా పోవు. ఇవేకావు, ఇటువంటి ఎన్నో బాధలు, మీరు పెద్దవాళ్లు.. మీకే ం చెప్పగలను. మనం విసుక్కుంటూ ఉంటే ఈ కష్టాలన్నీ చాల తీవ్రంగా కనిపించి వేధిస్తాయి. నవ్వుతూ, సంతోషం

కలిగించే పరిస్థితులను గౌరవిస్తూ, ప్రతీ అనర్థానికి అట్టే పట్టించు కోకుండా ఉంటే, ఈ కష్టాలను సులువుగా దాటవచ్చు".

అప్పుడు నాకనిపించిది, ఇంత చిన్న తనంలోనే ఎంత గొప్ప జీవితసత్యాన్ని ఆమె నేర్చుకుందని.

అత్తవారింట్లో ఆరునెలల్లో పడరాని బాధలు పడి బ్రతికి బైటకొచ్చిన ఆమె అనుభవంలోని సారాంశమిది.

కొత్తయింటి కొచ్చినా గోపాల్ తమ్ముడే పాలుపోస్తున్నాడు. ఉదయం తలుపు తడితే నేనే లేచి వెళ్లాను. ఈ రోజు తమ్ముడు రాలేదు. గోపాల్ స్వయంగా వచ్చాడు. పాలు కొలిపించుకున్న తరువాత అడిగాను.

"గోపాల్! గంగ దగ్గర నుండి ఉత్తరాలు వస్తున్నాయా ?"

జవాబు చెప్పడానికి బదులు అతను బావురుమన్నాడు. ఎంతో కష్టంగా అన్నాడు.

"బాబూజీ ! గంగ వెళ్లి పోయింది మనల్ని విడిచి"

ఏమాటలు నమ్మాలో, ఏవి నమ్మకూడదో నాకు తెలియకుండా పోయింది. ఎన్నో సందేహాలు.

మధ్యాహ్నం మా అబ్బాయి కంపెనీ నుండి తిరిగి వచ్చిన తరువాత వివరాలు తెలిశాయి.

ఆఖరి చెల్లెలి ఆపరేషన్ కోసం అప్పుచేసిన అయిదువేల రూపాయలు పట్టుకొని, గోపాల్ గంగను అత్తింట్లో విడిచివచ్చాడు.

గంగ అత్తవారింటికెళ్లిన రెండు వారాల్లోనే కబురు తెలిసింది, ఆమె చనిపోయిందని.

గోపాల్ లబో లబో మంటూ పరుగెత్తాడు. గంగ సహజంగా చచ్చి పోలేదు. అత్త, మొగుడు చంపేశారు. అదేనా దారుణంగా - గోనెలో దింపి కర్రలతో మోది చంపారు - పొలాలలో పారేశారు.

"పోలీసులు అరెస్టు చేయలేదా ?" అడిగాను.

"పదివేల రూపాయలు ఖర్చు పెట్టారు" అన్నాడు అబ్బాయి.

"ఎందుకు చంపారు ?"

"మరో సంబంధం పాతికవేల కట్నంతో వచ్చింది"

నా మనసు పాడయింది. నా ఆలోచనలన్నీ స్తంభించి పోయాయి

గంగలేదు.

కాని, గంగ కుట్టిన బొంత సాక్ష్యంగా ఉండిపోయింది.

(ఆంధ్రజ్యోతి - దీపావళి సంచిక)